




పోటీల ప్రారంభం సందర్భంగా క్రీడాజ్యోతిని అందుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

'కట్ట'డాలు..!

పెనుకొండ పట్టణంలో ఎక్కడ నిర్మాణం చేయాలన్నా నగరపంచాయతీ అధికారులకు కాసుల కట్టలు కొట్టాల్సిందే. నిబంధనల విరుద్ధంగా జరుగుతున్న కట్టడాలను అడ్డుకునే యత్నం చేసే అధికారులు విధులకు సెలవు పెట్టి వెళ్లాల్సిందే. పెనుకొండ నగరపంచాయతీ పరిధిలో వైకాపా పాలనలో అక్రమ భవనాలు, అనుమతులు లేని నిర్మాణాలు విచ్చలవిడిగా జరిగాయి. ఈ పరిస్థితి ఇప్పుడూ కొనసాగింపుగా నడుస్తోంది. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులే సూత్రధారులుగా వ్యవహారాలు నడుపుతూ వీటికి సమకరిస్తున్నట్లు తెలుస్తోంది. నగర పంచాయతీలో ఉన్నత అధికారికి డబ్బు కట్టాలిస్తే చాలు అనుమతులు వచ్చేస్తాయి. నిబంధనల ప్రకారం అన్‌లైన్‌లో చలానా కట్టి అనుమతులు కోరితే.. ఏవేవో సాకులు చూపుతూ నిరాకరిస్తారు. నేరుగా ఆ అధికారిని కలిసి కాసుల నోట్ల కట్టలు ఇస్తే మాత్రం 'కట్ట'డాలకు అనుమతులు ఇచ్చేస్తారు.





పెనుకొండ పట్టణం నారాయణమ్మ కాలనీలో రెండస్తుల భవనం

- నోట్ల కట్టపెడితే నిర్మాణానికి ఓకే
- ఆన్‌లైన్‌లో అనుమతులకు నో..
- అస్తవ్యస్తంగా పట్టణ ప్రణాళిక
- అక్రమ నిర్మాణాలకు అధికారుల అండ
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నగరపంచాయతీ పరిధిలో 20 వార్డులున్నాయి. పట్టణంలో మడకశిర రోడ్డు, నారాయణమ్మకాలనీ, కోనాపురం రోడ్డు, తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు అధికార పార్టీ నాయకుల అండతో నిర్మిస్తుంటే, మరికొందరు నగరపంచాయతీలో ఉన్నత స్థానంలో ఉన్న అధికారి చలువతో యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అక్రమ నిర్మాణాలను ఆపితే ఆ అధికారి మాత్రం అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారు.

అన్‌లైన్‌లో అనుమతులు నో...

గృహనిర్మాణాలు చేపట్టేవారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలి. నిర్మాణానికి సంబంధించిన ప్లాన్ ప్రకారం ఎంత మొత్తం చెల్లించాలో అన్‌లైన్‌లో నగదు చెల్లించాలి. అనంతరం కమీషన్ లాగిన్‌లో అనుమతులివ్వాలి. నిర్మాణ అనుమతులకు కావాల్సిన పత్రాలన్నీ సరిగా ఉన్నాయా?లేదా? అని పరిశీలించి అనుమతులు మంజూరు చేయాల్సి ఉంది. ఇక్కడ మాత్రం అన్‌లైన్ అనుమతులివ్వరు. కుంటిసాకులు చెబుతూ అనుమతులివ్వడానికి నిరాకరిస్తారు. కొందరు నేరుగా ఆ అధికారిని కలిసి బేరం కుదుర్చుకుంటారు. వారి స్తోమతను బట్టి రూ.40వేల నుంచి రూ.50ల వరకు సదరు అధికారికి ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ మొత్తం అందగానే నిర్మాణాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అనుమతులు వచ్చేస్తున్నాయనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి.

పట్టణ ప్రణాళిక అస్తవ్యస్తం

నగరపంచాయతీలో పట్టణ ప్రణాళిక అస్తవ్యస్తంగా మారిపోయింది. పెనుకొండ మేజర్ పంచాయతీ నుంచి నగరపంచాయతీగా మారినప్పటి నుంచి పర్మినెంట్ టౌన్‌ప్లానింగ్ అధికారి లేరు. డిప్యూటేషన్‌పై ఇక్కడ విధులు నిర్వహించే వారే ఎక్కువ. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై కూడా టౌన్‌ప్లానింగ్ అధికారి లేరు. కేవలం ఒక్కరు మాత్రమే ఈ విభాగంలో పని చేస్తున్నారు. వార్డుల్లో అక్రమ నిర్మాణాలను గుర్తించి పనులను ఆపుతున్నారు. అధికారి లేకపోవడం వల్ల అనుమతులు లేని నిర్మాణాలు, లేఅవుట్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

నగరపంచాయతీ పరిధిలో నిర్మించే నిర్మాణాలు, లే అవుట్లు తదితర వాటిపై నిబంధనల ప్రకారం చలానాల రూపంలో చెల్లిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. నగర పంచాయతీలో మాత్రం ప్రభుత్వ ఆదాయంకు బదులు అధికారుల ఆదాయం పెంచుకుంటున్నారు. అక్రమ లేఅవుట్లు, గృహనిర్మాణాలు యథేచ్ఛగా చేపట్టిన అధికారుల ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారనే విమర్శలున్నాయి. నగర పంచాయతీ అభివృద్ధి చెందాలంటే వివిధ వనరుల నుంచి ఆదాయం పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నగరం పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టడంలేదు. కనీసం నెలనెలా నిర్వహించాల్సిన సమావేశాలు కూడా జరపడం లేదు. కమిషనర్ ఉన్నారో లేదో కూడా ప్రజలకు తెలియని పరిస్థితి ఉంది. ప్రభుత్వ కార్యక్రమలుంటే వారు కనపడుతారు.. లేకుంటే లేదు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారించాల్సిన అధికారులు లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నతాధికారులు స్పందించి పెనుకొండ నగర పంచాయతీ పాలనను గాడిన పెట్టి, అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలకు అధికారుల అండ

పట్టణంలో అక్రమ నిర్మాణాలకు నగర పంచాయతీ అధికారుల అండ పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. నారాయణమ్మకాలనీలో నిర్మిస్తున్న రెండస్తుల గృహంకు ఎలాంటి అనుమతులు లేవు. రూ.50వేలు అధికారికి ముట్టజెప్పి దర్జాగా నిర్మాణం చేసుకుంటున్నట్లు సమాచారం. అదే కాలనీలో మరో నూతన ఇంటిని అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారు. మడకశిర రోడ్డులో నిర్మిస్తున్న రెండస్తుల భవనంకు రూ.40నుంచి 50వేలు కాసుల కట్టల అధికారికి అందించినట్లు తెలింది. జిఐసి కాలనీలో వైకాపా అధికారంలో ఉన్న సమయంలో గృహ నిర్మాణం అపేసారు. ఇంటి నిర్మాణంకు అనుమతులు తీసుకుని వ్యాపార సముదాయలు నిర్మిస్తున్నారని ఆసమయంలో నిర్మాణం అపేసారు. ప్రస్తుతం అధికారికి రూ.50వేలు చెల్లించి దర్జాగా వ్యాపార సముదాలు నిర్మాణం చేశారని విమర్శలున్నాయి. ఈ విషయంపై చుట్టు పక్కలవారు అధికారులకు ఫిర్యాదు చేసినా నగర పంచాయతీ అధికారులు స్పందించలేదు. ఇలా పట్టణంలో ఏ వార్డుకు వెళ్లినా అనుమతులు లేని నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.



పెనుకొండ పట్టణం మడకశిర రోడ్డులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం

క్రీడలతో మానసికోల్లాసం

- కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న
- పోలీస్ స్పోర్ట్స్ మీట్-2024 ప్రారంభం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నిత్యం ఉద్యోగ విధుల్లో ఉండే వారికి క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని కలిస్తాయని కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న తెలిపారు. పుట్టపర్తి పోలీస్ పరేడ్ మైదానంలో పోలీసుల జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ పోటీలు-2024ను బుధవారం ప్రారంభించారు. కలెక్టర్, ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా ఆటలు, క్రీడల జెండాను ఎగురవేశారు. క్రీడాజ్యోతిని వెలిగించి, శాంతి కపోతాలు, కలర్ బెలూన్ల మధ్య స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ను ప్రారంభించారు. మందుగా కలెక్టర్, ఎస్పీలు మహిళా పోలీసుల వంద మీటర్ల పరుగు పోటీలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ షార్ట్ పుట్ విసిరి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. పోటల్లో భాగంగా 8 విభాగాలు(5,పోలీస్ సబ్ డివిజన్లు, 1- ఏఆర్, 1 - హెడ్ క్వార్టర్ విభాగం) నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొంటున్నారు. పోటీల్లో పరుగు పందేలు, కబడ్డీ, కోకో, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్‌పుట్, షటిల్, టెన్నిస్, టగ్ ఆఫ్ వార్ తదితర ఆటలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో పని చేసే పోలీసుల కోసం పరేడ్ మైదానంలో పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్‌మీట్‌ను పండుగ వాతావరణంలో ఉత్సాహంగా నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలు వ్యాయామం వారి జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే వారికి క్రీడలు మరింత దోహదం చేస్తాయన్నారు. శారీరక దఢత్వాన్ని కాపాడుకోవడానికి ఏదో ఒక వ్యాయామం, క్రీడను విధిగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆటలో గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ ఉద్యోగరీత్యా పోలీసులకు ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటారని తెలిపారు. మానసికంగా వాటిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరికీ క్రీడలు ఎంతో అవసరమని తెలియజేశారు. నిత్యం బందోబస్తు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరస్తుల అన్వేషణ, రోడ్డు ప్రమాదాలు తదితర వాటిలో బిజీగా ఉండే పోలీసులకు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడానికి స్పోర్ట్స్, గేమ్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని మనసులో నింపుకుని ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. మూడు రోజులు పాటు జరిగే క్రీడా పోటీలను ప్రతి పోలీసు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, కెవి.మహేష్, శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్ఐలు మహేష్, వలి, రవికుమార్, ఆర్ఎస్ఐలు వీరన్న, ప్రదీప్ సింగ్, వెంకటేశ్వర్లుతో పాటు జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు అన్ని సబ్ డివిజన్ల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



షార్ట్ పుట్ విసిరి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపుతున్న ఎస్పీ రత్న

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి - కొత్తచెరువు, పరిగి



షేక్ మహమ్మద్ షఫీవుల్లా

పరిగి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్ మహమ్మద్ షఫీవుల్లాను విధుల నుండి సస్పెండ్ చేసినట్టు డీఈవో క్రిష్టప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ మార్కెట్ పేరుతో పేద ప్రజలను మోసం చేసినట్లు తమ విచారణలో వెల్లడైనందున ఆయనపై చర్యలు తీసుకున్నమన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

పాడిఆవుపై చిరుత దాడి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని ఆదేపల్లి గ్రామ సమీపంలో మేత మేస్తోన్న పాడి ఆవుపై చిరుతపులి బుధవారం దాడి చేసింది. బాధిత రైతు ఆదినారాయణప్ప తెలిపిన వివరాల మేరకు ఆవు గడ్డి మేస్తున్న సమయంలో చిరుత దాడి చేసిందని, ఆసమయంలో ఆవు బిగ్గరగా అరవగా అక్కడికి వెళ్లి చూశానని చెప్పారు. చిరుత దాడి చేస్తుండగా గట్టిగా కేకలు వేయడంతో చిరుత కనుమ ఎర్రకొండ అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయిందని ఆయన తెలిపారు. కనుమ అటవీ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేపుతోంది. ఐదేళ్ల క్రితం సంజీవరాయునిపల్లి సమీపంలో చిరుత మృతదేహం లభించగా, ఇన్నేళ్ల తర్వాత మళ్లీ చిరుత సంచారం స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. వీరాపురం, దేమకేతేపల్లి, టేకులోడు, చిలమత్తూరు పంచాయతీల్లో ఎర్రకొండ అటవీ ప్రాంతం విస్తరించి ఉండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఫారెస్ట్ అదికారులు చిరుతను బందించి దట్టమైన అటవీ ప్రాంతంలో వదలాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి : ఎమ్మెల్యే



అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

అధికారులకు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. బుధవారం మండలంలోని గంగినేపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏ కార్యాలయంలో అయినా సరే ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండేవారు కాదని అన్నారు. కనీసం బాధితులను కార్యాలయం మెట్లు కూడా ఎక్కనివ్వలేదని విమర్శించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చెన్నేకొత్తపల్లి దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న భూ సమస్యల మీద పలువురు రైతులు అర్జీలు సమర్పించారు. రెవెన్యూ సదస్సులో తీసుకున్న ప్రతి అర్జీకి ఖచ్చితమైన పరిష్కారం చూపించాలని ఒకవేళ అది పరిష్కరించలేని సమస్య అయితే దానికి వివరణ కూడా ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గ్రామానికి వచ్చే రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉందని స్థానికులు పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లారు.. ఈసారి తాను గ్రామానికి నూతన తారు రోడ్డు వేసిన తర్వాతే వస్తానని పరిటాల సునీత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రొద్దం : భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ నాగేంద్ర తెలిపారు. బుధవారం మండలంలోని రొద్దకంపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీదేవి, సర్వేయర్ కార్తీక్ సోము, నాయకులు నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : రైతులు తమ భూ సమస్యలు పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవాలని తహశీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఓబులాపురం రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలు వారి భూ సమస్యలపై అర్జీలు అందజేస్తే వాటినీ నిర్దేశించిన సమయంలోగా పరిష్కరిస్తామన్నారు. ఈ రెవెన్యూ సదస్సులో సర్పంచి బి. సరస్వతి,దేవాదాయ శాఖ అధికారిణి నాగరత్నమ్మ, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి టి.రాజశేఖర్, గ్రామసర్వేయర్ బి.వేదవతి, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణే రాజ్యాంగ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

బాధ్యతలను గుర్తు చేయడంతో పాటు హక్కులను పరిరక్షించడమే భారత రాజ్యాంగ ముఖ్య ఉద్దేశమని న్యాయవాదులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను విస్మరించకుండా హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం స్థానిక అజీజియా మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది జి. శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, కళావతి, నవేరా, సంతోషి కుమారి, హబ్బా మాట్లాడారు. భారత రాజ్యాంగంలో అన్ని మతాలు, కులాల వారికి సమానమైన అవకాశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యంగా మైనారిటీ వర్గాలు మరింత అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ప్రత్యేక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వాలకు రాజ్యాంగం ద్వారా మార్గ నిర్దేశం చేయడం జరిగిందన్నారు. అందుకు అనుగుణంగా మైనారిటీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రత్యేక రిజర్వేషన్ సదుపాయాలు సైతం అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ బాధ్యతలను చక్కగా నిర్వర్తించి ఉత్తమ పౌరులుగా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సెల్ ఫోన్‌ను కేవలం అవసరమైన మేరకు మాత్రమే ఉపయోగించాలన్నారు. అదే విధంగా తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సమాజాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. మైనార్టీల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు, కళాశాలలను సైతం ప్రభుత్వాలు ఏర్పాటు చేసి విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం ఎన్నో మెరుగైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనికి తోడు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు 18 ఏళ్ల వయసు వచ్చేంతవరకు వివాహం చేసుకోరాదన్నారు. విషయంపై తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. 14 సంవత్సరాల వరకు పిల్లలు తప్పనిసరిగా విద్యను నేర్చుకోవాలన్న ఉద్దేశంతో భారత రాజ్యాంగం ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నూర్ షరీఫ్, లోక్ అదాలత్ సిబ్బంది శారద, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : జిల్లా యంయండిఎ అధ్యక్షులు రోషన్ జమీర్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలోని ఆయనకార్యాలయంలో జాతీయ మైనారిటీ హక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా రోషన్ జమీర్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను గౌరవిస్తూ మైనారిటీ ప్రజల హక్కులను పరిరక్షించడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు దాదా పీర్ తో పాటు యంయండిఎ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో జనరేటర్ ప్రారంభం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



జనరేటర్ ప్రారంభిస్తున్న రత్నాకర్

శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో బుధవారం అత్యాధునిక జనరేటర్‌ను సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ ప్రారంభించారు. శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్‌లో అధునాతన 1010 కిలో వాట్స్ డీజిల్ జనరేటర్‌ను శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ – రత్నాకర్ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ ,డాక్టర్ గురుమూర్తి సమక్షంలో బుధవారం ప్రారంభించారు .రూ. 95 లక్షల వ్యయంతో కొనుగోలు చేయబడిన ఈ జనరేటర్ ప్రారంభ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిలియంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం టౌన్ : భగవద్గీత శ్లోకాల పోటీల్లో ధర్మవరం పట్టణంలోని శివానగర్‌లో గల బ్రిలియంట్ స్కూల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు ఆపాఠశాల కరెస్పాండెంట్ సివి శేషు తెలిపారు. అనంతపురంలోని ఇస్కాన్ వారు నిర్వహించిన భగవద్గీత శ్లోక పారాయణములో తమ పాఠశాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనపర్చినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపి, లక్ష్మీదేవి, సుబ్బరాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి బీటెక్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండల పరిధిలోని మల్లేనిపల్లి గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున రైలు నుంచి జారి పడి నిఖిల్ కుమార్ రెడ్డి అనే బిటెక్ విద్యార్థి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన శ్రీనివాస రెడ్డి సుదమ్మ దంపతుల కుమారుడు నిఖిల్ కుమార్ రెడ్డి చెన్నై లో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో స్వగ్రామానికి రైలులో వస్తున్నాడు. మల్లేనిపల్లి వద్దకు రాగానే నిద్రమత్తులో ఉన్న నిఖిల్‌కుమార్‌రెడ్డి బాత్‌రూమ్ తలుపులు అనుకోని రైలు మెయిన్ డోర్ తెరిచాడు. ఈ క్రమంలో కాలు జారి క్రింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన నిఖిల్ కుమార్ రెడ్డి ప్యాంటు జేబులో వున్న సెల్ ఫోన్ తో తండ్రికి ఫోన్ చేసి చీకట్లో రైలునుంచి జారి పడి ఎక్కడో పడిపోయానని లొకేషన్ షేర్ చేసాడు. వెంటనే కుటుంబ సభ్యులు లొకేషన్ ఆధారంగా వెళ్లి తీవ్రంగా గాయపడిన విద్యార్థి నిఖిల్‌ను చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఒక ప్రయివేట్ ఆసుపత్రి కి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా జరిగిన సంఘటనపై అటు రైల్వే ఇటు స్థానిక పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



మొక్కలు నాటుతున్న అధికారులు

మొక్కలు నాటిన సిబ్బంది

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో కార్యాలయం సిబ్బంది బుధవారం మొక్కలు నాటారు. ఎంపీడీవో రామ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపిఒ అనిల్ కుమార్, ఈసీ శివ ప్రసాద్,19మంది ఫీల్డ్ అసిస్టెంట్లు కలసి కార్యాలయం ఆవరణంలో దాదాపు 25 పలు రకాల మొక్కలు నాటారు.

ఉద్యానపంటల సాగుపై దృష్టి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి ఉద్యానవన పంటల సాగుపై దృష్టిసారించాలని ఉద్యాన పంటల అధికారి ఎస్ ప్రతాప రెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని మేకల చెరువు, ముడుపులజీవి, ఎదురుదోన గ్రామాల్లో పర్యటించిన ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వసతిగృహం ప్రారంభం

ప్రజాశక్తి:- చిలమత్తూరు

మండల పరిధిలోని 44వ జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టులో గల సమర్థనం వికలాంగుల ట్రస్ట్ లో నూతన వసతిగృహాన్నిబుధవారం ప్రారంభించారు. ఈ మేరకు ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ మహంతేష్ చేతుల మీదుగా వసతిగృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్‌లో శిక్షణ తీసుకొనే వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, సౌకర్యంగా ఉండేందుకు రూ.25 లక్షలతో వసతిగృహం నిర్మించినట్లు తెలిపారు. బాలికలు, బాలురుకు వేర్వేరుగా వసతిగృహాలు నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్,సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, ట్రైనర్లు నరసింహమూర్తి, సిబ్బంది శంకర్, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

గోరంట్ల పొలం సర్వే నెంబర్ 72-2 విస్తీర్ణం 1,22 పైకి 0,61 సెంటు,72-6 విస్తీర్ణం 0,29 పైకి 0,14,5 సెంట్లు మొత్తం 0,75,5 సెంట్ల భూమి ని లెట్ తలారి వీరప్ప కుమార్తెలు అయిన చింతామణి ఆదిలక్ష్మి, ఆర్.ఈశ్వరమ్మ అను వారు పి.చంద్రశేఖర్ రెడ్డి(వడల చంద్రారెడ్డి) S/o.పి.నరసింహారెడ్డి అను నాకు విక్రయించగా 08-11-2024లో చిలమత్తూర్ సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. ప్రతివాదుల మీద పెనుకొండ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో దావా నెంబర్ 302/24 వ్యాజ్యం పెండింగ్ ఉన్నది కావున ఈ భూమి కి సంబంధించి క్రయ విక్రయాలు చేయరాదు. అలా చేసిన వారు కోర్టు ఆదేశాల మేరకు శిక్షార్హులు.

KP.రమేష్ బాబు, అడ్వకేటు, పెనుకొండ
సెల్ : 6305685949

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు,కదిరి.

E.P. No:47/2019 in O.S. No:170/2016

Between:

బణావత్ శకుంతలబాయి W/o R.C.నాగప్ప Working as a లైబ్రేరీయన్, బ్రాంచ్ లైబ్రరీ గాండ్లపెంట గ్రామం మరియు మండలం ...D.Hr

మరియు

బి.ప్రసాద్ S/o నానే నాయక్, Formerly Working as లైబ్రేరీయన్ ఓ.డీ.చెరువు Now Working as బ్రాంచ్ లైబ్రరీ తలుపుల గ్రామం మరియు మండలం. ...J.Dr

వేలం ప్రకటన

యావన్మందికి ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు కేసులో ఈ.పి.లో జెడ్జిమెంట్ డెటార్ (జె.డిఆర్ఎస్) కు చెందిన క్రింద కనపరిచిన షెడ్యూలు షెడ్యూల్ దాఖలా ఆస్తిని డిక్రీ హోల్డర్ బాకీ వసూలు కొరకు వేలం వేయుటకు పై కోర్టు వారు నిర్ణయించారు. సదరు వేలం పై కోర్టులో 02/01/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు నిర్వహించబడును.కావున ఆసక్తి గల వేలం దారులు పై కోర్టు నందు 02/01/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు వేలంలో పాల్గొనవచ్చునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

రిజిస్ట్రేషన్ జిల్లా హిందూపురం Now పుట్టపర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కదిరి, కదిరి రెవెన్యూ గ్రామం, కదిరి మండలం.

Gove. Dry. S.No. 1743-4 Ac. 1.28 Cents Full
Gove. Dry. S.No. 1630-2 Ac. 1.00 Cents Full

Value Rs. 7,00,000/-

వేలం ఆయకమునకు లోబడి పాడవలయును
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:02/01/2025
స్థలం : కదిరి

జి.గురులింగస్వామి, బి.ఎ., బి.ఎల్,
డిక్రీ హోల్డర్ తరుపు వకీలు, కదిరి

జిల్లా సమగ్రాభివృద్ధిలో లక్ష్యాన్ని సాధించాలి

కలెక్టర్ టిఎస్. చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా 60 శాతం లక్ష్యాన్ని సాధించడానికి అన్ని శాఖల అధికారులు ప్రణాళిక నివేదికలు సమర్పించాలని కలెక్టర్ టిఎస్. చేతన్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ద్వామా గ్రామ వార్డు సచివాలయాలు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం మరింత మెరుగు పర్చలన్నారు. దిన కూలి 300 రూపాయలు అందే విధంగా వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకుని కుటుంబాల సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, వికలాంగుల పింఛను, ధ్రువీకరణ కార్యక్రమం ఈనెల 28వ తేదీకి పూర్తి చేయాలన్నారు. బత్తలపల్లి, ముదిగుబ్బ, ధర్మవరం సీసీ రోడ్డు పనులు వచ్చే జనవరి నాటికి పూర్తి చేయాలన్నారు. పుట్టపర్తి, ఎన్‌పి కుంట, నల్లమాడలో మంజూరైన పనుల పురోగతి సరిగా లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. స్వచ్ఛభారత్ కు సంబంధించి వచ్చేవారం మండలాల వారీగా నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ద్వామా పీడీ విజయ్ ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పంచాయతీరాజ్ ఎస్ఇ మురళికృష్ణ, డిపిఒ సమత, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటసాగులో అవగాహన కల్పించాలి : వ్యవసాయంపై విస్తతంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో వ్యవసాయ అనుబంధ రంగాల 15 శాతం జి.ఎస్.డి వృద్ధిరేటే లక్ష్యం అనే అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు నెలల స్థిర లక్ష్యాలను సాధించడానికి ఆయా శాఖల ఆధ్వర్యంలో మండలాలు వారిగా, డివిజన్ వారిగా నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి రైతులు విరివిగా పాల్గొనే విధంగా చూడాలని తెలిపారు. పంటల బీమాపై మండలాల వారీగా నివేదికలు సమర్పించాలన్నారు. కౌలు రైతులకు మరింత మేలు జరిగే విధంగా అందరి, సలహాలు సూచనలు స్వీకరించి కౌలు రైతు చట్టం అమలు చేయాలన్నారు. పురుగుమందుల పిచికారి ఇతర పనుల పర్యవేక్షణకు కిసాన్ డ్రోన్ టెక్నాలజీనివినియోగించాలన్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన డ్రోన్ పైలట్ల వివరాలు అందించాలన్నారు. మండలాలకు కొత్త డ్రోన్ పైలట్లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. రాగి పంట విస్తీర్ణంపై మండలాల వారిగా వివరాలు సమర్పించాలన్నారు. వ్యవసాయ యాంత్రికరణ పనితీరు, ఉత్పత్తి, ఆదాయం, రైతులకు అందుతున్న పంట రుణాల మంజూరు గురించి నివేదికలు ఇవ్వాలన్నారు. వచ్చే ఒక సంవత్సరం సాధించాల్సిన ప్రగతి మండలాల వారీగా వినియోగిస్తున్న టెక్నాలజీ గురించి డేటాను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఎన్ని గోకులాలను మంజూరు చేసింది, పశు గణన, పశువుల పెంపకం క్రెడిట్ కార్డుల పథకం అమలు తదితర వివరాలను వచ్చే సమావేశంలో సమర్పించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఆర్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, ఎపిఎంఐపి పీడీ సుదర్శన్, సెరికల్చర్ అధికారి పద్మమ్మ, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, కో-ఆపరేటివ్ అధికారి కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణన్ ఆశయాలు కొనసాగిస్తాం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎల్ఆర్‌జి విద్యాసంస్థల డైరెక్టర్ నిఖిల్ గోవింద్ రామ్మూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎల్ఆర్‌జి పబ్లిక్ స్కూల్ లో ఆవరణంలో సూపర్ స్పిన్నింగ్, ఎల్ఆర్‌జి విద్యా సంస్థల వ్యవస్థపక అధ్యక్షులు ఎల్‌జి బాలకృష్ణన్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత బాలకష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో రెడ్ క్రాస్ బ్లడ్ అసోషియేషన్ వారి సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు పలువురు రక్తదానం చేశారు. అనంతరం ఎల్ ఆర్ జి విద్యాసంస్థల డైరెక్టర్ నిఖిల్ గోవింద్ రామ్మూర్తి, మాట్లాడుతు తమ పెద్దలు ఎంతో ఉన్నతాశయంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలను స్థాపించడంతో పాటు అందులో పని చేస్తున్న కార్మికుల పిల్లలకు, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విధ్యను అందించాలన్న సంకల్పించి ఎలా ముందు సాగారో...వారి ఆశయాలకు అనుగుణంగా తాము సైతం ముందుకు సాగుతామని అన్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని విద్యా సంస్థలను స్థాపించి, తక్కువ ఫీజులతో నాణ్యమైన విధ్యను అందించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శి బాల సుందరం మాట్లాడుతూ హిందూపురం ప్రాంతంలో బాలకృష్ణన్ విరివిగా పరిశ్రమలను స్థాపించి ఎన్నో కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. అలాంటి వ్యక్తి జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యంగా ఉన్న వారందరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. అఖిల భారత ఫ్రీడం ఫైటర్ టిప్పు సుల్తాన్ షహీద్ మానవతా రక్తదాన సంఘం జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. బాలకృష్ణన్ హిందూపురంలో స్పిన్నింగ్ మిల్లులు, ఇతర సంస్థలు విద్యా సంస్థలు స్థాపించి హిందూపురం అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. ఇందులో భాగంగా 50 సార్లు రక్తదానం చేసిన పాఠశాల కార్యదర్శి బాల సుందరంను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా 43 మంది రక్తదానం చేయగా రక్త దాతలకు రూ.లక్ష హెల్త్ ఇన్సూరెన్స్‌ను రెడ్ క్రాస్ సంస్థ అందజేసింది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, పాఠశాల ఉపాధ్యాయులు, రక్తదాతలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మోడల్ పేపర్లు ఆవిష్కరణ



మోడల్ పేపర్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించే ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లను బుధవారం మండలంలోని గుట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆవిష్కరించారు. మాజీ సర్పంచి సూర్యనారాయణ సౌజన్యంతో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ ఆధ్వర్యంలో 10 వ తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు మోడల్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత ఎం సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు యుటిఎఫ్ మోడల్ పేపర్లను చదివి మంచి మార్కుల తో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ పాఠశాల లో 10 వ తరగతి పరీక్షలలో మొదటి, రెండవ స్థానం సాధించే విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ వరకూ చదివించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల శ్రేయస్సును కూడా దృష్టిలో ఉంచుకుని ప్రతి ఏడాది మోడల్ పేపర్లను అందుబాటులోకి తీసుకువస్తోందని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగార్జునుడు మాట్లాడుతూ ఈ మోడల్ పేపర్ నుంచి ప్రతి ఏడాది 70 నుంచి 80 మార్కుల ప్రశ్నలు వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు రమేష్, నాయకులు పెద్ది రాజు, ఆదిజినేష్, తెలుగు నాడు విద్యుత్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, తెలుగు దేశం పార్టీ నాయకులు నాగార్జున తదితరులతో పాటు గోవిందు , మహబూబ్ బాషా, రాజు పూజారి శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

సామాజిక సేవలకు ఫలితమే జాతీయ సేవారత్న అవార్డు వరించిందని సిపిఎం పట్టణ కార్యదర్శి జివిల్ నరసింహులు అన్నారు. సామాజిక సేవలకు సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తుగా హైదరాబాద్ కి చెందిన ఆల్ ద బెస్ట్ అకాడమీ తరపున సామాజిక వేత్త ప్రజాశక్తి దినపత్రిక కదిరి అర్బన్ విలేఖరి మద్దిమడుగు నాగేష్‌కి జాతీయ సేవా రత్న అవార్డు ప్రదానం చేశారు. దీంతోకదిరి జర్నలిస్టుల తరపున బుధవారం పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథిగృహంలో నాగేష్‌ను సన్మానించారు. ప్రజాశక్తి విలేకరి హరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి నరసింహులు, ఎస్ఎఫ్ఐ బాబ్జాన్, సిఐటియు జగన్మోహన్, విలేకరులు రవి, శ్రీనివాసులు నాయక్, శివప్ప, రమణ, జిలాన్, రహంతుల్లా, చంద్ర రెడ్డి, రామకృష్ణ, రమేష్, బాబా తదితరులు నాష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ సమాజంలో సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. పత్రికా విలేకరిగా ఉంటూ సమాజ సేవలో భాగంగా తనవంతు బాధ్యతగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ అవార్డుతో ఆయనను సమాజం పట్ల మరింత బాధ్యత పెరిగిందన్నారు. అవార్డు గ్రహీత నాగేష్ మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతలను మరింత పెంచిందన్నారు. జాతీయ సేవా రత్న అవార్డు ఎంపిక చేసిన ఆల్ ది బెస్ట్ అకాడమీ వ్యవస్థాపకులు సూర్యనారాయణ, హైకోర్టు న్యాయమూర్తి చంద్రయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. s ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

బహిరంగ ప్రకటన

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (BPCL) వారు సర్వేనెం.1355-1A, దొరిగిల్లు గ్రామ పొలంలో, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా, ఆంధ్రప్రదేశ్ వద్ద **0.51 సెంట్లు విస్తీర్ణం. తూర్పు :** ముదిగుబ్బ, పులివెందల హైవే రోడ్డు, **దక్షిణం: కె.ప్రశాంతి** గారి జమీను, **పడమర: కె.ప్రశాంతి** గారి జమీను, **ఉత్తరం : కె.ప్రశాంతి** గారి జమీను చెందిన భూమి హద్దులుగా గల స్థలంలో **రిటైల్ ఔట్‌లెట్** నెల కొల్పుటకు ప్రతిపాదిస్తున్నదని తెలియజేయడమైనది. ఇందు నిమిత్తం **శ్రీకందుకూరి ప్రశాంతి, W/o.కందుకూరి రామకృష్ణ**, దొరిగిల్లు గ్రామ పొలంలో, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారి నుండి సదరు భూమి లీజుకు తీసుకోబడుచున్నది. సదరు ఆస్తిపై ఏవిధంగానైనా ఏదైనా హక్కు లేదా క్లెయిమ్ కలిగిన ఎవరైనా వ్యక్తి లేదా సంస్థ (వ్యవస్థీకృత లేదా వ్యవస్థీకృతం కాని) నేటి నుంచి 7 రోజులలోగా తమ క్లెయిమ్‌కు మద్ధతుగా సంబంధిత మరియు అవసరమైన టైటిల్ డాక్యుమెంట్లతో దిగువ తెలిపిన చిరునామాలో దిగువ సంతకందారుకు వాటిని తెలియజేయవలెను.

సంప్రదించుట కొరకు :

టెరిటరీ మేనేజర్ (రిటైల్), నెల్లూరు.
(BPCL) భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్.,
26-3-1711, బి.వి.నగర్, మినీ బైపాస్ రోడ్డు, నెల్లూరు సిటీ,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఎ.పి.-524004.



పరిటాల శ్రీరామ్‌కు జ్ఞాపికను అందిస్తున్న పద్మశాలీయుల సంఘం నాయకులు

పద్మశాలీయుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -ధర్మవరం టౌన్

పద్మశాలీయుల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. నూతనంగా ఎంపికైన పద్మశాలీ కమిటీ అధ్యక్ష,ఉపాధ్యక్షులైన పుత్తరుద్రయ్య,జింకా నాగభూషణం తోపాటు పలువురు పద్మశాలీయులు బుధవారం పరిటాల శ్రీరామ్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో పద్మశాలీలు కూటమికి అండగా నిలిచారని అన్నారు. పద్మశాలీయుల సమస్యలను ఇప్పటికే ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. పద్మశాలీలు ఐక్యంగా అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

ప్రజాశక్తి -పరిగి

మండల వ్యాప్తంగా ఉన్న కార్మికుల సమస్యలపై పోరాటానికి సిద్ధంగా కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు.బుధవారం పరిగి మండల కేంద్రంలోని బీరలింగేశ్వర స్వామి కళ్యాణమండపంలో కన్వినింగ్ కమిటీ సభ్యుల ఎంపికలో జడ్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న కార్మికులందరూ ఐక్యంగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగాకన్వినింగు కమిటి మండల కన్వీనర్ గా శివకుమార్, కమిటీ సభ్యులుగా ప్రికాట్ నందకుమర్, నందీశ్వర, అంజి, అది, అంజినప్ప, ఓబులేష్, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులతో నాయకులు జడ్పీ శ్రీనివాసులు

కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

విద్యార్థి మృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎఐఎస్‌బి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐఎస్‌బి సంఘం నాయకులు మాట్లాడారు.ఈసందర్భంగా ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న ప్రేమ్ సాయి అనే విద్యార్థి పై తోటి విద్యార్థులు దాడి చేయడం వల్ల మృతిచెందాడన్నారు. సంబంధిత కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల జరిగిన ఈ సంఘటనపై అధికారులు చొరవ తీసుకొని విద్యార్థులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారన్నారు. కానీ సంఘటన ఎలా జరిగింది, ఎందుకు జరిగింది, అని ఆలోచించకుండా గాలికి వదిలేయడం చాలా దుర్మార్గపు చర్య అన్నారు. సంస్కృతి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల జరిగిన సంఘటనలో యాజమాన్యంపై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన పెద్ద ఎత్తున ఎస్పీ కార్యాలయం తో పాటు కలెక్టర్ కార్యాలయం, కళాశాల ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, జయవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఉన్న అయ్యప్ప స్వామి భజన మందిరంలో తెలుగుదేశం పార్టీ ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తన మేనకోడలు వడ్లమూడి మీరా పేరు మీదుగా మాలదారులకు అన్నదానం చేశారు.

'విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్ - 2047'పై అవగాహన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణంలోని కెహెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ అధ్వర్యంలో 'విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్ 2047' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్నికళాశాల ప్రిన్సిపల్ కె.ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎస్.నారాయణ స్వామి మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధిలో విద్యార్థుల పాత్రను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకట రాముడు, గోపాల్ నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎస్ చిట్టెమ్మ, ఎ.కిరణ్‌కుమార్, బి.త్రివేణి, ఎస్.షమీవుల్లా, ఎస్.పావని తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ఉత్సవాల్లో గ్లోబల్ జెన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలోని బాబయ్య స్వామి 752వ ఉరుసు క్రీడా ఉత్సవాలు 2024 భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గ్లోబల్ జెన్ విద్యార్థులు విజేతగా, ప్రగతి విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు విద్యార్థులకు మెడల్స్‌ను అందించి అభినందించారు. మరిన్ని బహుమతులు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు.అనంతరం జాతీయ వినియోగదారుల దినోత్సవం వేడుకల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వినియోగదారులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి వినియోగదారుల చట్టలపై అవగాహన కలిగి వుండాలని సూచించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ వినియోగదారులు ప్రతి నిత్యం జాగ్రత్త వహించి తమకు సమస్య ఉంటే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త చెరువు మండల వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఇ. సత్యనారాయణ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రథం మరమ్మతుకు విరాళాలు అందించండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పేట వెంకటరమణ స్వామి రథ మరమ్మతులకు దాతలు విరాళాలు అందించాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి నరసింహమూర్తి కోరారు. బుధవారం రథ మరమ్మతులకు సంబంధించిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రథ మరమ్మతుకు దాదాపు రూ. 12 లక్షలు వ్యయం అవుతుందని తెలిపారు. పట్టణంలోని అతి పురాతనమైన దేవాలయ రథ మరమ్మతులకు దాతలు తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జేపికే రాము, కౌన్సిలర్ రాఘవేంద్ర, నాయకులు వైటీపీ శ్రీనివాస్, రవి, భగీరథ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రాత్మక ఘట్టానికి ఏడాది పూర్తి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

నారా లోకేష్ యువగలం పాదయాత్ర ఘట్టానికి ఏడాది పూర్తిఅయిందని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్రకు ఏడాది పూర్తి అయిందన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలనను అంతం చేయడానికి రాష్ట్ర యువతను మేల్కొలపడానికి లోకేష్ నిర్వహించిన పాదయాత్ర చారిత్రాత్మకమైందని అన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో తాను కూడా భాగస్వామిని అయినందుకు గర్వపడుతున్నానన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడే ఉద్దేశంతో పాదయాత్ర చేపట్టిన లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - తాడిమర్రి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు అవుతున్న గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు కుల్లాయప్ప, బండల వెంకటేష్, లక్ష్మీనారాయణ, దాసు, సన్న పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - గుడిబండ

మండల పరిధిలోని కరికెర, చిగతూర్పి రైతు సేవ కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎఓ వీర నరేష్ పంటసాగుపై రైతులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమానికి రెండు గ్రామాల ప్రజా ప్రతినిధులు, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ప్రతినిధి బాయరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి హేమలత, రైతు సేవ కేంద్రం అధికారులు శంకర్ రెడ్డి, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ' పేరుతో హంగామా..

ప్రజాశక్తి - ముదిగుబ్బ

కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో ఆర్భాటం చేసిందే కాని సిమెంట్ రోడ్లు నిర్మించడంలో విఫలమైందని సిపిఐ నాయకులు విమర్శించారు. మండలంలో ఇప్పటిదాకా సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టక పోవడాన్ని నిరసిస్తూ బుధవారం సిపిఐ నాయకులు ముదిగుబ్బ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆపార్టీ నాయకులు చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో దివాకర్‌కు సమర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో కూటమి నాయకుల అనైక్యత, వర్గ విభేదాల వల్లనే రోడ్లు నిర్మించలేకపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీకి చెందిన మండల నాయకులు సమిష్టిగా పనిచేసే మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తిప్పయ్య, రాధాకృష్ణ, తుమ్మల చిన్నప్ప, రామకృష్ణ యాదవ్, గంగిరెడ్డిపల్లి నాయుడు, చల్లా శంకర, ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడిని ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండలం బడన్నపల్లికి చెందిన శివయ్య అనే గొర్రెలకాపరిని ఆదుకోవాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు జెవి. రమణ, ఆయూబ్‌ఖాన్, ఆదినారాయణ మాట్లాడారు. శివయ్యకు చెందిన 40 గొర్రెలు మంగళవారం సాయంత్రం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మృతిచెందాయన్నారు. 40 గొర్రెలు చనిపోవడంతో గొర్రెల కాపరి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాడన్నారు. ప్రభుత్వం బాధిత గొర్రెల కాపరిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.